# వెలుగు దాచిన చీకటి

కారు బయలుదేరబోతోంది. ఇంతలో హడావిడిగా నర్సు వచ్చి, 'డాక్టర్' అని పిలిచింది. యాక్సిలేటరు మీద నుంచి కారు బ్రేకు మీదకు మళ్లింది.

"ఏం విజయా? నువ్వు కూడా సిటీకి వస్తావా?" అని డాక్టరు అడిగాడు.

"నాకు ఇంకా డ్యూటీవుంది డాక్టర్."

"శంకర్ అని పిలు."

"ఇక్కడ అట్లా పిలువలేను."

"ఎందుకని?"

"ఇక్కడ మీరు పెద్ద డాక్టరు. నేను జూనియర్ నర్సుని."

"ఇతరుల దృష్టిలో కావచ్చు. నువ్వు నన్ను శంకర్ అని పిలిస్తేనా ఆనందం."

"అల్లాగే డాక్టర్."

"అదుగో మళ్లీ."

"మరిచిపోయాను శంకర్."

"ఇంతకీ మనమిద్దరం అసలు విషయం మర్చిపోయాం."

"ఏమిటది?"

"ఆ ప్రశ్న వేయవలసింది నేను. బయల్దేరబోతుంటే ఆపిందెవరు?"

"నేనే."

"ఎందుకనో?"

"ఈరోజు వుదయం వచ్చాడే పేషెంటు..."

"చాల మంది వచ్చారుగా!"

"ఆపరేషను కోసం వచ్చాడు నెం. 22. అతను మిమ్మల్ని ఒక్కసారి చూడాలనుకొంటున్నాడు."

"సాయంకాలం రౌండ్సుకు వచ్చినప్పుడు చూస్తాను."

"కాదు శంకర్, ప్లీజ్."

"సరే పద. నువ్వింతగ చెపుతున్నప్పుడు వెళ్ళక తప్పుతుందా? రాణీగారి ఆజ్ఞ" అంటూ కారు దిగి రోగి దగ్గరకు వ్లాడు.

"ఎల్లా వుండయ్యా?" అని అడిగాడు.

అతనేం మాట్లాడలేదు. రెప్పవాల్చకుండా ఇతని వంకనే చూస్తున్నాడు. ముఖంలో అంతులేని భయం కన్పిస్తోంది. చివరకు,

"శంకర్" అని అన్నాడు. డాక్టర్ ముఖంలో సంచలనం లేదు.

"శంకర్" అని మళ్లీ అన్నాడు.

"అవును. శంకర్నే."

"నేను బ్రతకను. నన్ను చంపేస్తావు."

"నేను వైద్యం నేర్చుకుంది నిన్ను చంపడం కోసం కాదు."

"నాకు భయం వేస్తోంది."

"జాగర్త. భయం నుంచి దూరంగా వుండు. లేకపోతే అదే నిన్ను కబళించి వేస్తుంది."

"నన్ను ఇక్కడ నుంచి ఇంకొక హాస్పిటలుకు పంపించేసెయి."

"అది నా చేతుల్లో లేదు."

"నేను ఇక్కడ ఒక్క క్షణం వుండలేను."

"ఎందుకని?"

"నువ్వు నన్ను చంపేస్తావు. నీ కోపం నాకు తెలుసు."

"చూడు రాము, శంకర్ నిన్ను చంపచ్చు. కాని ఇక్కడ వున్నది డాక్టర్ శంకర్."

"ఎవరైతేనేం? నాకు ఇద్దరూ ఒకటే. నన్ను వదిలిపెట్టు. రోగంతో కృంగి కృశించే నామీదనా నీ పగ?" అంటూ రెండు చేతులు జోడించి నమస్కారం చేసాడు.

శంకర్ ఏం మాట్లాడలేదు. సరాసరి వచ్చి కారులో కూర్చుని కారు స్టార్టు చేసాడు.

వెనక సీటులో కూర్చున్న విజయ "ఆపు శంకర్" అని అంది. కాని కారు దిగలేదు. సరాసరి సముద్రపు ఒడ్డుకు వెళ్లి ఆగింది. కారు దిగి నీటి అంచున నిలబడ్డాడు.

"శంకర్" అని విజయ పిలిచింది.

అతను పలకలేదు.

పిలుపు మళ్లీ రెట్టించింది. ఈసారి అతనిలో చలనం కలిగింది. పిలుపు వచ్చిన దిక్కుకు చూసాడు. ముఖంలో బాధ కనిపిస్తోంది.

"శంకర్, ఏం జరిగింది?" అని చిన్నదాని కంఠం గద్గదంగా పలుకరించింది. ఆ పిల్ల చేయి పుచ్చుకొని,

"విజ్జీ! నన్ను ఎప్పుడు వదిలిపెట్టనని మాట ఇయ్యి."

"ఏమిటిది శంకర్?"

"ముందు ప్రమాణం చెయ్యి."

"ప్రమాణం చేస్తున్నాను. మీ పాద సాక్షిగ మిమ్మల్ని ఎప్పుడు వదిలిపెట్టను.'

"నిజమేనా?"

"నిజమే. ముమ్మాటికీ! ఏం జరిగిందో చెప్పవూ?"

"దయచేసి నన్నేమి అడగద్దు."

రాత్రి ఇంటికి తిరిగి వచ్చేసరికి ఎనిమిది దాటింది. వరండాలో గోవిందు కనపడి,

"మీ కోసం ఎవరో వచ్చారు?" అని అన్నాడు.

డ్రాయింగు రూములో ఎవరో కూర్చుని ఏదో పత్రిక పుటలు తిరగ వేస్తున్నారు. కొన్ని క్షణాలు పరకాయించి చూసి ఏం మాట్లాడకుండా కిటికీ దగ్గరకు వెళ్లి నిలబడ్డాడు. ఆవిడ లేచి వచ్చి యితని దగ్గరగా నిలబడి మెల్లగా,

"శంకర్" అని పిలిచింది.

"మళ్లీ ఎందుకు వచ్చావు?"

"ప్రాణభిక్ష పెట్టమని ప్రార్థించడానికి."

"ఎవరికి? ప్రాణం తీసిన వారికా? ప్రాణం తీయించినవారికా?"

ఆవిడకు యింతవరకు దాగిన శోకం కట్టలు తెగింది.

"వారిని రక్షించు శంకర్."

"రక్షించనని నీకు భయమా?"

"వారే నా సర్వస్వం. వారి కేదైనా జరిగితే, నేను ఒక్క క్షణం బ్రతకలేను.'

"వెళ్లిపో. ఇక్కడినుంచి వెళ్లిపో."

"నువ్వు మాట ఇస్తేనే గాని వెళ్లను."

"మాట ఇవ్వాలి? నాకు ఇచ్చిన మాటలన్నీ ఏం చేసావు కమలా?"

"పాపిష్టిదాన్ని! నిలుపుకోలేకపోయాను."

"అని ఇప్పుడు అంటున్నావు."

"నన్ను ఏమైనా అను. కాని వారిని రక్షించు."

"నేను చెయ్యగలిగింది ఏమీలేదు."

"అల్లా అనవద్దు. ఈ దేశంలో నువ్వు తప్ప ఎవ్వరూ ఆయన్ని రక్షించలేరు.'

"మనిషిని మనిషి రక్షించలేడు కమలా! దైవానికే ఆ శక్తి వుంది."

"నువ్వు దైవానివే. ఎందరి ప్రాణాలు రక్షించావు."

"వారికి నాయందు పూర్తి నమ్మకముంది. వారు నాకు ఎప్పుడూ ఏ అపకారం చెయ్యలేదు."

"మేము చేసామా?"

"మరిచిపోవడం నీకు సహజమే. నేను లండను వెళ్లే రోజు నాతో ఏమన్నావు గుర్తుందా? ఎన్ని యుగాలైనా నీ కోసం ఎదురు చూస్తూ వుంటాను. ఈ కమల హృదయంలో శంకర్‌కు తప్పన వేరొకరికి స్థానం లేదు అని నువ్వే అడక్కుండా హామీ ఇచ్చావు. 'శంకర్ కమలకు ఏ లోటూ రానివ్వను. అన్ని విధాల తోడుగ వుంటాను' అని రాము మాట ఇచ్చాడు. అప్పటికి గాని నా మనస్సుకు శాంతి చేకూరలేదు. ఇంగ్లండు వెడుతున్నాను. ఏదైనా క్రొత్త విషయం, క్రొత్త చికిత్సా పద్ధతి కనుక్కోగలిగితే నా జీవితం ధన్యం అవుతుందని ఆశపడ్డాను. పాస్‌పోర్టు వచ్చిన రోజున ఎంత సంబరపడ్డాను. మనమంతా పెద్ద పార్టీ చేసుకొన్నాం. ఆనాటి రాత్రి తోటలో, వెన్నెలలో మనం ఏకాంతంగా వున్నప్పుడు ఏమన్నావో జ్ఞాపకం వుందా? నా అంత అదృష్టవంతురాలు ఎవరూ లేరు. నా జీవితం ఇల్లాగే గడిచిపోతే చాలు. నాకేం అక్కర్లేదు.

నేనూ నా అంత అదృష్టవంతుడు ఈ జగత్తులో లేడని గర్వపడ్డాను. విదేశాలు వెడుతున్నామని సంబరమే కాని బయల్దేరవలసిన రోజు దగ్గరకు వస్తుంటే ఏదో చెప్పలేని దిగులు, ఒంటరితనం నన్ను బాధించేవి. నేను వెళ్లే రోజున నువ్వు ఆడదానివి కాబట్టి కంటతడి పెట్టగలిగావు. నేను మొగవాడిని కనుక నాకు ఆ అదృష్టం లేదు.

మొదటి ఆరు నెలలు ఎంత గడ్డుగ గడిచాయో నీకు తెలుసు. అంతులేని ఒంటరితనం, దేశంకాని దేశం వీటితో సతమతమయ్యాను. ఆరోజున ఒక పెద్ద ఆపరేషను చేసాము. బ్రతకడేమో ననుకొన్న వ్యక్తిని మృత్యుముఖం నుంచి కాపాడాను. ఆపరేషన్ థియేటరు నుంచి బయటికి రాగానే నేను అడిగిన మొదటి ప్రశ్న 'ఈరోజు తారీఖు ఎంత?' 'జూలై 7' అని నర్సు చెప్పింది. వెంటనే పిచ్చివాడిలా

బజారుకు పరిగెత్తాను. ఒక ముత్యాలహారం కొన్నాను. నీకోసమే. ఆనాడు నీ పుట్టినరోజు. మనం మొట్ట మొదట కలుసుకొన్నది కూడా నీ పుట్టిన రోజు పండుగనాడే.

ముత్యాలహారం తీసుకొని ఇంటికి వచ్చాను. అక్కడ మీ శుభలేఖ నా కోసం, నా ఆశలు అడియాసలు చెయ్యటానికి సిద్ధంగ వుంది. అది నాకు చేరేసరికి మీరిద్దరూ దంపతులై ఆరు రోజులైంది. అప్పటి నా పరిస్థితి నీకు ఎలా చెప్పను?

ఇంతకాలం ప్రాణంతో సమానంగా ప్రేమించిన ప్రియురాలు ప్రాణం కన్న ఎక్కువనుకొన్న స్నేహితుడు ఒక్కసారిగ పరాయివాళ్లయిపోయారు. ఏడాదిలోనే ఇంత మార్పా, నేనంటే ఇంత అలక్ష్యం. నాతో చేసిన స్నేహం, చెప్పిన మాటలు అన్నీ బూటకం. రాము రాసిన వుత్తరం నన్ను చిత్రవధ చేసింది. మీరు అప్పటికే ఎన్నో రోజుల నుండి ప్రేమించుకొన్నారుట. తనమీదనే కమలకు ఎక్కువ ప్రేమట. మీరు వివాహం చేసుకోవటం సమ్మతమే కాని మీరు చేసిన ద్రోహాన్ని క్షమించలేక పోయాను. ఆనాడే రాము ఎదురైతే హతమార్చేవాడిని. కాని దేశం వదిలి వెళ్లటానికి కూడ నాకు స్వతంత్రం లేదే. ఉన్న స్వతంత్రమల్లా ఒక్కటే. ఆత్మహత్య! చచ్చిపోదామని బయల్దేరుతుంటే దైవం నన్ను రక్షించాడు. వెంటనే రమ్మని హాస్పిటలు నుండి ఫోను వచ్చింది.

డాక్టర్ థామస్ ఒక్కడే నన్ను అర్థం చేసుకోగలిగింది. మనసు విప్పి ఆయనతో అంతా చెప్పివేసాను. ఆయన ఒక్కటే మాట అన్నాడు.

"మానవజన్మ ఉత్కృష్టమైన ఘనకార్యాలు సాధించటానికి. అల్పమైన చింతలతో, క్లేశాలతో నాశనం కావడం కోసం కాదు! ఆరోజే శంకర్ నశించాడు. డాక్టర్ శంకర్ ఉద్భవించాడు.

మారిపోయిన నా జీవితంలోకి మళ్లీ పీడకల లాగ వచ్చారు. నువ్వు వెళ్లిపో. నాకు మళ్లీ కనిపించవద్దు. మీరు కనపడితే చాలు నా కోపం ఆగదు. ఇప్పుడిప్పుడే నా జీవితం కోలుకుంటోంది. మళ్లీ మంచిరోజులు వచ్చే ఆశలున్నాయి. దాన్ని నాశనం చేయవద్దు."

"ఎవరా అదృష్టవంతురాలు?"

"నీకు ఎప్పుడు చెప్పను. రాముకేం ఫర్వాలేదు. నేను చేయగలిగిందంతా చేస్తాను. కాని ఒక్కమాట. నీ రికమెండేషన్ వల్ల నేను రాముకి ప్రత్యేకంగ చేయగలిగింది ఏం లేదు. ఒక రోగికి డాక్టరుగా చేయవలసిందంతా చేస్తాను."

"శంకర్!"

"వెళ్లిపో ప్లీజ్."

"వెడుతున్నాను శంకర్. కాని ఒక్కమాట నమ్ము. నా మనసులో ఇప్పటికీ నీ యందు ప్రేమవుంది."

"చాలు కమలా! నాకు చేసిన ద్రోహం చాలు! రాముకి కూడ ద్రోహం చేయవద్దు."

"ద్రోహమా?"

"అవును. ద్రోహమే. ఆనాడు నువ్వు అవివాహితవి. నీ ఇష్టం వచ్చినవాడిని ప్రేమించడానికి హక్కు వుంది. ఈనాడు నా స్నేహితుడి ఇల్లాలివి. అతనికి అన్యాయం చేస్తే నేనే కాదు- భగవంతుడు కూడా నిన్ను క్షమించడు."

"నన్ను క్షమించు శంకర్."

శంకర్ ఏం మాట్లాడలేదు. కారు వేసుకొని సరాసరి హాస్పిటలుకు వచ్చాడు.

డ్యూటీ నర్సు అతన్ని చూడగానే,

"ఈవినింగ్ డాక్టర్" అని అంది.

"ఈవినింగ్ సిస్టర్" అని అంటూ లోపలికి వెడుతున్నాడు.

"ఎమర్జెన్సీ ఏమైనా వుందా?"

"లేదు."

"విజయ సినిమాకి వెళ్లింది."

కారు సినిమా హాలు చేరింది. సినిమా నుంచి వస్తున్న విజయ, వాళ్లన్నయ్య కనిపించారు. ఇతన్ని చూడగానే అతను,

"హల్లో! డాక్టర్" అని పలుకరించాడు.

"నేను మీతో ఒక విషయం మాట్లాడాలి."

"ఇంటికి వెళ్లి మాట్లాడుకుందాం."

"మీకు అభ్యంతరం లేకపోతే బీచికి వెడదాం!"

"అల్లాగే."

బీచి చేరగానే శంకర్,

"నా గురించి విజయ మీతో చెప్పిందనుకుంటాను."

"అంతా చెప్పింది. మా అందరికి చాల సంతోషం. అమ్మ మిమ్మల్ని ఒకసారి యింటికి తీసుకురమ్మన్నది."

"నేను ఈ నెలలో రాయవెల్లూరు వెడుతున్నాను. రెండు మూడు నెలల దాక రాకపోవచ్చు. నేను వెళ్లేలోపల..."

"చెప్పండి."

"మా వివాహం కావాలని నా కోరిక."

"ఈ నెలలోనా?"

"అవును."

"వ్యవధి చాలదేమో!"

"నాకేం పెద్ద ఆడంబరం అక్కర్లేదు. నా తరపున వచ్చేవాళ్లు కొద్దిమంది. వాళ్లకు ఈ వ్యవధి చాలు."

"రేపు సాయంకాలం మా ఇంటికి రండి. అన్ని విషయాలు మా అమ్మతో సంప్రదించుదాం" అని అతను కారు వైపుకు నడిచాడు.

అతను వెళ్లగానే విజయ,

"నామీద ఆ మాత్రం నమ్మకం లేదా?" అని అడిగింది.

"నమ్మకం లేనిది నీమీద కాదు, నా అదృష్టంమీద."

"ఎందుకని? మీరు దగ్గర లేకపోతే నా మనసు మారిపోతుందనా?"

"కాద విజ్జీ! అంత మాటనవద్దు. నిన్ను వదిలి ఒక్క క్షణం వుండలేక... నువ్వు నా భార్యవైతే నువ్వు కూడా నాతో బాటు రావచ్చు. నిన్ను వదిలి రెండు నెలలుండటం నా శక్తికి మించిన పని."

"క్షమించు. క్షమించండి."

"క్షమించవలసింది నన్ను."

మరునాడు ఉదయం రాముని ఆపరేషన్ థియేటరుకు తీసుకు వెళ్లబోతుంటే, శంకర్ అతని దగ్గరకు వెళ్లి,

"ఎల్లా వున్నావు రామ్?" అని అడిగాడు.

కొంచెం సేపు ఏం మాట్లాడలేదు. చివరకు,

"నాకు ఆపరేషన్ ఎవరు చేస్తారు?" అని అడిగాడు.

"నేను కాదులే. భయపడకు. డాక్టర్ చౌదరే నిన్ను ఆపరేట్ చేస్తారు."

రామ్ కంటివెంట నీరు తిరిగింది.

"నన్ను క్షమించు శంకర్" అని అన్నాడు.

శంకర్ చిరునవ్వు నవ్వి అక్కణ్ణించి వెళ్లిపోయాడు. ఆపరేషన్ బల్లమీద రామ్ డాక్టర్ చౌదరితో,

"నాకు చాల భయంగ వుంది డాక్టర్‌గారు. నేను పోతే నా భార్య దిక్కులేనిది అవుతుంది. దానికి ఎవ్వరూ లేరు."

"ఎందుకయ్యా భయపడతావు. నీకేం భయంలేదు. నీ మునిమనుమడి పెళ్లి కూడా చూస్తావు." అని అంటూ క్లోరోఫారమ్ ఇచ్చాడు.

ప్రక్కగదిలోకి వెళ్లి 'డాక్టర్' అని పిలిచాడు.

డాక్టర్ శంకర్ వచ్చాడు.

రెండు గంటలు మృత్యువుతో పోరాడి జయించాడు.

శంకర్ బయటికి రాగానే కమల కళ్లలో కనపడిన ప్రశ్న,

"ఎల్లా వున్నారు?"

"ఏం ఫర్వాలేదు. ఇంకా వంద సంవత్సరాలు బ్రతుకుతాడు."

"శంకర్, శంకర్" అంటూ అతని పాదాలమీద వ్రాలింది.

అతనేం మాట్లాడక రెండడుగులు ముందుకు వేసి ఒక్కక్షణం ఆగి,

"కాము" అని మెల్లిగా పిలిచాడు.

ఆ పిలుపుకు ఆవిడ ఒక్కసారి ఉలిక్కిపడ్డది.

ఏదో ఇంకొక లోకంలోంచి వచ్చినట్లుంది ఆ పిలుపు.

"కామూ!" తన హృదయాన్నే కానుకగా ఇచ్చినవాడు.

శంకర్ తననిట్లాగే పిలిచేవాడు.

"నేను ఆపరేషన్ చేసినట్టు మాత్రం రాముతో చెప్పవద్దు. వాడు ఆ దెబ్బకి తట్టుకోలేడు." అంటూ బయటకు నడిచాడు.